ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో ఎస్‌పి సందర్శన

ప్రజాశక్తి -నెల్లూరు :ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఎస్ పి డాక్టర్ కె తిరుమలేశ్వర్ రెడ్డి సందర్శించారు. శుక్రవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమం లో నగరంలోని డీకే డబ్ల్యూ సర్వోదయ జూనియర్ కళాశాలలను సందర్శించి ,పరీక్ష కేంద్రాల వద్ద తీసుకున్న భద్రతా చర్యలు, సి సి కెమెరాల పనితీరు, పరీక్షలు జరుగుతున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భం గా పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న 81 ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసామన్నారు.

మాట్లాడుతున్న ఎస్పి

'వేమిరెడ్డికి' ఎందుకు పంతం..!

..వైసిపి నేతలు రావాలని ఒత్తిడి
..నేడు టిడిపిలో చేరిక
సన్నాహాలు, బాబు రాక
..వైసిపి టార్గెట్ వేమిరెడ్డేనా...?

రాజకీయాలు రోజు రోజుకు మారిపోతున్నాయి., ఒకప్పుడు పార్టీ విధానాలపై నేతలు పార్టీలు మారే పరిస్థితులుండేవి. ఒక నేత వెళితే ఆయన అనుచరులు తనతోపాటు వెళ్లడం పరిపాటి. ప్రస్తుతం జిల్లా రాజకీయాల్లో వేమిరెడ్డి హాట్ టాపిక్‌గా మారింది. వైసిపి విధానాలు నచ్చకపోతే టిడిపిలో చేరడం సహజం. వైసిపి నేతల ఇళ్లకు వెళ్లి తనతోపాటు రావాలంటూ ప్రాథేయ పడడం విచిత్రంగా కనిపిస్తోంది. వైసిపిని భారీగా దెబ్బతీయడానికి ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది ముఖ్య మంత్రి, వైసిపి అధిష్టా నానికి ఆగ్రహం తెప్పిస్తోంది. ఆయన వెళితే వెళ్లవచ్చు., మాపార్టీ నేతలను ప్రలోభ పెడుతున్నార ంటూ సీరియస్ అవుతున్నట్లు సమాచారం. ఆయన టిడిపిలో చేరినప్పటి నుంచి వేమిరెడ్డే వైసిపికి టార్గెట్ కానున్నట్లు తెలుస్తోంది. ఆయనపై విమర్శస్త్రాలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ రాజకీయ పరిణామాలు ఎలా దారితీస్తాయో చూడాలి..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రముఖ వ్యాపారవేత్త, వేమిరెడ్డి ప్రబాకర్‌రెడ్డి రాజకీయాల్లో రాటు తేలుతున్నట్లు కనిపిస్తున్నారు. సౌమ్యుడుగా తన పనితాను చేసుకు వెళ్లే ఆయన ఇప్పుడు అధికారపార్టీకి కయ్యానికి కాలుదువ్వుతున్నారు. 2019 ఎన్నికలకు ముందు టిడిపిలో చేరి రాజ్యసభ తీసుకోవాలని భావించిన ఆయనకు చుక్కెదురా వడంతో వైసిపిలో చేరారు. రాజకీ యాల్లో ఉన్నా ఇతర పార్టీనేతలు, వ్యక్తులపై ఏనాడు విమర్శలు చేయలేదు. తనపని తాను చేసుకుపోయారు. ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలతో ఒక్కసారిగా ఆయన మరో కోణాన్ని బయటకు తీస్తున్నారు. వైసిపి నేతలు తనకు గౌరవం ఇవ్వలేదని మనస్థాపం చెందిన ఆయన ఆపార్టీకి రాజీనామా చేసి, టిడిపిలో చేరుతున్నారు. ఎక్కడా వైసిపి నేతలు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి చిన్న మాట అనలేదు. తనను అవమానించిన పార్టీకి తనేమిటో చూపించాలని ఆయనలోని రాజకీయ నేతను బయటకు తీసుకున్నారు. శత్రువును దెబ్బతీయడానికి ,తన వాళ్లనే వాడు తున్నారు. జిల్లాలోని వైసిపి ముఖ్యనే తలను తనతోపాటు టిడిపిలోకి తీసుకెళు తున్నారు. మాజీ మంత్రి పి. అనిల్‌కుమార్, బాబాయ్ రూప్‌కుమార్‌యాదవ్‌తో పాటు పలువురు నేతలను తీసుకెళు తున్నారు. జిల్లా వ్యాపితంగా తన సత్తా ఏమిటో చూపించాలని చూస్తు న్నారు. భారీగా నేతలను తనతో రావాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. వేమిరెడ్డి ఇంటికి రోజు కొందరు నేతలు క్యూ కడుతున్నారు. వైసిపిని దెబ్బతీయాలనే ఆయన పనితీరు పట్ల ఆపార్టీ నేతలు ఆగ్రహంతో ఉన్నారు. కందుకూరు ఎంఎల్‌ఎ మహీధర్‌రెడ్డి, అల్లూరు మాజీ ఎంఎల్‌ఎ కాటంరెడ్డి విష్ణువర్దన్‌రెడ్డి ఇళ్లకు వెళ్లి తనతో టిడిపిలోకి రావాలని కోరినట్లు తెలిసింది. ఇది కాకుండా అనేక మందికి ఫోన్లు చేసి తనతో వస్తే చూసుకుంటానని చెప్పినట్లు సమాచారం. వైసిపిలో ఉన్న నేతలు వేమిరెడ్డి పేరు చెప్పి టిడిపిలో చేరిపోతున్నారు. నాలుగేళ్ల పార్టీలో పనిచేసిన తమను కాదని కొత్తవాళ్లు వస్తున్నారని, అధికారంలోకి వస్తే తమ పరిస్థితి ఏమిటని గగ్గోలు పెడుతున్నారు. వేమిరెడ్డి వస్తే ఆర్థికంగా సహాయప డడంతో పాటు, తమ గెలుపునకు సహకరిస్తారని నేత లు ఆనందం వ్యక్తం చేస్తుండగా, ఆయన వెంట వస్తున్న నేతలతో తమకు రాజకీయ భవిష్యత్తు ఉండదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేమిరెడ్డికి ఎందుకు ఇంత పంతమని వైసిపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయన టిడిపిలో చేరిన వెంటనే టార్గెట్ చేయడానికి వైసిపి నేతలు సిద్ధపడుతున్నట్లు సమాచారం. ఏం జరుగుతుందో చూడాలి.

కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి వస్తున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్‌రెడ్డిని కలిసేందుకు కారులో వచ్చిన వేమిరెడ్డి

నేడు చంద్రబాబురాక.. భారీగా చేరికలు..!

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు నేడు జిల్లాకు రానున్నారు. ఉదయం 11 గంటలకు విజయవాడ నుంచి హెలికాప్టర్‌లో కనుపర్తిపాడు పాఠశాల మైదానంలో దిగుతారు. అక్కడ నుంచి విపిఆర్ కన్వేక్షన్ సెంటర్‌లో జరిగే సభలో పాల్గొంటారు. అక్కడ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, ఇతర ముఖ్యనేతలు చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరుతారు. బాబు రాక సందర్భంగా భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

వైసిపి నెల్లూరు ఎంపి అభ్యర్థిగా విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు వైసిపి ఎంపి అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డి పేరును ఖరారు చేస్తూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఆ పార్టీ జాబితా విడుదల చేసింది. ఇటీవల రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆపార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్య ంలో వైసిపి తరపున ఎంపి అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. సుధాకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, హరిశ్చంద్రారెడ్డిలను పోటీ చేయాలని వైసిపి అవకాశం ఇచ్చినా ఎవరూ ముందుకు రాలేదు. ఈ మేరకు జిల్లాకు చెందిన ఎంపి విజయసాయిరెడ్డిని వైసిపి అభ్యర్థిగా ప్రకటించారు.



ఎంపి విజయసాయిరెడ్డి

బాల్య వివాహాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు

మండలంలోని మాచవరంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన పై సాంస్కృతిక కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్ర మాన్ని శుక్రవారం నిర్వహిం చారు.బాల్యవివాహాలు జరిపించిన ప్రోత్సహించిన చట్టరీత్యా నేరమని బాల్యవివా హాలు జరిపిస్తే జరిగే అనర్థాలను గురించి వివరించారు. కార్యక్రమంలో కందుకూరు సిడిపిఒ శర్మిష్ట , సూపర్‌వైజర్ ప్రభావతి, పంచాయతీ సెక్రటరీ అంజయ్య, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ టెర్మినల్ యథావిధిగా కొనసాగించాలి

-సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-నెల్లూరు

కృష్ణపట్నం పోర్టులోని కంటైనర్ టెర్మినల్ తరలింపు ప్రక్రియను అదాని యాజమాన్యం తక్షణమే నిలిపివేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు.శుక్రవారం కార్మిక, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కంటైనర్ టెర్మినల్ తరలింపును వ్యతిరేకిస్తూ నెల్లూరు నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన స్వతంత్ర పార్కు ప్రాంతం నుంచి నగరంలోని ప్రధాన ఆర్‌టిసి బస్టాండ్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా అభివృద్ధి కోసం పోర్టును ఏర్పాటు చేసిందని, అదాని అభివద్ధి కోసం కాదన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని హితవు పలికారు. అదాని తన నియంత్రణలోని థర్మల్ విద్యుత్ స్టేషన్ల అభివృద్ధి కోసం కృష్ణపట్నం పోర్టును బొగ్గు మయంగా చేయాలని చూడటం సరికాదన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ ప్రయత్నాలను అడ్డుకోవాలని, తన పోర్టుల అభివృద్ధి కోసం కృష్ణపట్నం పోర్టును పావుగా వాడుకోవాలనుకుంటున్న ఆదాని సంస్థ దుష్టపన్నాగాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ కార్యకలాపాలు యథా విధంగా సాగేలా చూడాలన్నారు.

కృష్ణపట్నం పోర్టును ఆధారంగా చేసుకొని పనిచేస్తున్న అనేక వేల మంది కార్మికులపై, దానికి సంబంధించిన గోదాములలో పని చేస్తు న్న కార్మికులపై, పలు విభాగాలలో పనిచేస్తున్న కార్మికులపై ప్రభావం చూపిస్తుందన్నారు. పోర్టు ఆధారంగా చేసుకొని పరిశ్రమలు స్థాపన జరిగితే రవాణాకు ఉపయోగపడుతుందని అందరం ఆశించామన్నారు. ఇప్పటి వరకు కృష్ణపట్నం పోర్టులో దిగుమతి అవుతున్న గ్రానైట్ , ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్న గుంటూరు మిర్చి పూర్తిగా నిలిచిపోయాయన్నారు. దీనికి ప్రధాన కారణం కృష్ణ పట్నం పోర్టులోని కంటైనర్ కార్గో పనులు నిలిపివేయడమే అన్నారు. దీనివల్ల కృష్ణపట్నం పోర్టుకు విదేశాల నుంచి వచ్చే షిప్‌లకు సంబందించిన షెడ్యూల్స్ ప్రకటించక పోవడం శోచనీయమన్నారు. అఖిల పక్ష నాయకులు షెడ్యూల్స్ ఏమైనా ఉన్నాయా అని యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే అందుకు సరైన సమాధానం లేదన్నారు. కంటైనర్ కార్గోను తక్షణమే తెరిపించాలని, నడిపించాలా లేకపోతే యాజమాన్యాన్ని శిక్షించాలని కార్మిక సంఘాల తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంతంలో నిర్వహించిన సభా కార్యక్రమానికి సిఐటియు రూరల్ కార్యదర్శి కిన్నెర కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కృష్ణపట్నం పోర్టు సిఐటియు కార్మిక సంఘం నాయ కులు ఎం.మోహన్‌రావు, గోగుల శ్రీనివాసులు, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.వి.వి. ప్రసాద్,కె.అజయ్‌కుమార్, సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, వ్యకాస. జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు, గిరిజన సంఘం నాయకులు ప్రభాకర్, ఐద్వా నాయకురాలు ఎస్‌కె రెహనాబేగం, సిఐటియు రూరల్ నాయకులు కండే కోటేశ్వరరావు, అల్లాడి గోపాల్, ఆటో యూనియన్ నాయకులు ఎం.రాజ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు

నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-కందుకూరు:ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ ఆత్మీయత సమ్మేళనం కార్యక్రమం వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి ఎంఎల్‌సి లేళ్ల అప్పి రెడ్డి, టీటీడీ బోర్డు మెంబర్ సిద్ధవటం యానాదయ్య , ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తొండమూల పుల్లయ్య, ఎపి నాయి బ్రాహ్మణ ప్రధాన కార్యదర్శి వల్లూరు కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులకు వైసిపిలో ఎంతో మేలు జరిగిందని మునుముందు జగన్మోహన్ రెడ్డి నాయీ బ్రాహ్మణ చట్టసభల్లోకి శాసనమండలం ద్వారా తీసుకొస్తారని ఆశిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఆర్‌ఎంపిలకి, పిఎంపి లకి ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్ జారీ చేస్తానని చెప్పిన మన ప్రియతమ నాయకులు అప్పటి ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని తలపెట్టి ఈ కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఆయన కీర్తిశేషులయ్యారని తెలిపారు. తర్వాత ప్రభుత్వం చంద్రబాబునాయుడు ఆర్‌ఎంపి, పిఎంపి ట్రైనింగ్ అని తుంగలో తొక్కారన్నారు. మళ్లీ జగన్మోహన్ రెడ్డి దీన్ని అమలు చేసి సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మార్కాపురం రామారావు , ఎపి నాయీ బ్రాహ్మణ కోశాధికారి గోనుగుంట వేణు, కళాకారుల సంఘం అధ్యక్షులు కరేటి సుబ్బారావు, ఎపి నాయీ బ్రాహ్మణ యువజన కార్యదర్శి చింతలపూడి సురేష్ , కందుకూరు పట్టణ నాయీ బ్రాహ్మణ సోదరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలేస్తున్న దృశ్యం

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-కందుకూరు:తెలుగుదేశం, జనసేన పార్టీల కలయికతో భారీ మెజారిటీతో మరో రెండు నెలల్లో కొత్త ప్రభుత్వం ఏర్పడబోతోందని కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 32 వార్డు పరిధిలోని 60 అడుగుల రోడ్డు, ఐఎస్ రావు నగర్ ప్రాంతాల్లో బాబుష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ నిన్న తాడేపల్లిగూడెంలో భారీ బహిరంగ సభ, చరిత్రలో నిలిచిపోయేలా జరిగిందన్నారు. ప్రభుత్వం పోలీసుల ద్వారా ప్రజలను అడ్డుకునేందుకు ప్రయత్నించినా, ఆర్టీసీ బస్సులు ఇవ్వకుండా వ్యవహరించినా, ప్రజలు మాత్రం స్వచ్ఛందంగా తరలివచ్చి ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రదర్శించారన్నారు.కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, 32 వార్డ్ అధ్యక్షుడు ముప్పవరపు వేణు, అత్తంటి వరప్రసాద్, చుంచు వేణు, గుమ్మళ్ల మాల్యాద్రి, ఎండ్లూరి బ్రహ్మయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రచారంలో ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరులోని 9వ వార్డు రెవెన్యూ కాలనీలో నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య రెండవ రోజు శుక్రవారం ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.మహిళలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ బాబుష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంచారు.

మద్దతు కూడగట్టే పనిలో 'బుర్రా'

ప్రజాశక్తి-కందుకూరు:వైసిపి కందుకూరు సమన్వయకర్త కనిగిరి శాసనసభ్యుడు బుర్ర మధుసూదన్ యాదవ్ పలువురు డాక్టర్లు ,ప్రముఖులను కలిసి శుక్రవారం పరిచయం చేసుకున్నారు. కందుకూరు వైసిపి అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగబోతున్న తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. పట్టణంలోని డాక్టర్లు శివకుమార్ రెడ్డి ,సాకేత్, అజ్మల్ హుస్సేన్, తన్నీరు మల్లికార్జున తో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ దివి లింగయ్య నాయుడును బుర్ర వారి ఇళ్లకు వెళ్లి కలవడం జరిగింది. ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనకు మీ అండదండలు ఇవ్వాలని అభ్యర్థించారు.

డాక్టర్ శివకుమార్ రెడ్డిని కలిసిన బుర్రా

శంఖారావం సభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-కందుకూరు:తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలుగుదేశం పార్టీ భవిష్యత్ నేత నారా లోకేష్ రానున్న ఎన్నికలలో విజయమే లక్ష్యం గా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న శంఖారావం సభలను జయప్రదం చేయాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ పిలుపునిచ్చారు. మొదటి విడతలో ఉత్తర ఆంధ్రలో దిగ్విజయం గా నిర్వహించి, 3 వ తేదీ, ఆదివారం నుండి ఉమ్మడి ప్రకాశం జిల్లా లో యువ శంఖారావం సభలను పున్ణ ప్రారంభం చేస్తున్నారని వాటిలో పెద్ద ఎత్తున తెలుగు దేశం, తెలుగు యువత నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, యువత, విద్యార్థులు, రైతులు పాల్గొని కోరారు.

ప్రజాశక్తి-పొదలకూరు

పట్టణం, సంగం రోడ్డులోని ఓ ప్రయివేట్ ప్రాంగణంలో నిర్వహించే నారా లోకేష్ బాబు శంఖారావం సభను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులతో టీడీపీ ఇన్‌ఛార్జ్ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, యువనేత ,సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయ కర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పొదలకూరు మండల నాయకులు తో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడారు. .కార్యక్రమంలో పొదలకూరు టిడిపి మండల అధ్యక్షుడు టి. మస్తాన్ బాబు, పట్టణ అధ్యక్షులు బి. మల్లికార్జున నాయుడు, నాయకులు పి వెంకటరత్నం నాయుడు, కె .వెంకటేశ్వర్లు నాయుడు, భాస్కర్ రెడ్డి ,రాజా, జమీర్ భాష, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐతే 'వెంకటగిరి'..కాదంటే 'ఆత్మకూరు'..!

పోటీకి సిద్ధమైన 'ఆనం'

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

వైసిపికి రాజీనామా చేసిన వెంకటగిరి ఎంఎల్‌ఎ ఆనం రామనారాయణరెడ్డి అటో, ఇటో తేల్చుకోలేకపోతున్నారు. తనకు సిట్టింగ్ స్థానం వెంకటగిరి టికెట్ ఇవ్వాలని ఆయన కొద్ది రోజులుగా పార్టీ అధినేత చంద్రబాబునాయుడును కోరుతున్నారు. గత స్థానం ఆత్మకూరు నుంచి పోటీచేయాలని ఆపార్టీ అధినేత చెప్పినట్లు తెలిసింది. మూడు నెలల నుంచి ఆయన అటో, ఇటో తేల్చుకోకుండా ఇంటికే పరిమితమయ్యారు. ఎన్నికలు ముందుకొస్తున్నాయి. జిల్లాలోని అనేక స్థానాల విషయంలో క్లారిటీ వచ్చినా ఆనం విషయం మాత్రం ప్రశ్నగానే మిగిలింది. వెంకటగిరి, ఆత్మకూరు, సర్వేపల్లి, కోవూరు స్థానాలు పక్కన పెట్టారు. బిజెపితో టిడిపి పొత్తు ఉండడంతో ఆపార్టీ సిటీ కోరుతుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇక సమయం లేకపోవడంతో బాబు నిర్ణయం ప్రకారం వెళ్లాలని ఆనం రామనారాయణరెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.నేడో, రేపో చంద్రబాబునాయుడుని కలిసి తన విషయం ఏమిటని తేల్చుకోనున్నారు. ఆయన నిర్ణయం ప్రకారం వెళ్లాలని చూస్తున్నారు. తాను అడుగుతోన్న వెంకటగిరి, లేదంటూ పార్టీ చెబుతోన్న ఆత్మకూరుకు వెళ్లడం దాదాపు ఖరారైనట్లు సమాచారం

ఎంఎల్‌ఎ ఆనం

ప్రతి పైసాకూ సిఎం లెక్కచెప్పాలి

ప్రజాశక్తి-నెల్లూరు

సంక్షేమ బోర్డు నిధులను పక్కదారి మళ్లిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి పైసాకూ భవన నిర్మాణ కార్మికులకు లెక్క చెప్పాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం భవననిర్మాణ కార్మిక సం ఘం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో కొండాయపాలెం రైల్వే గేట్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఐదుసంవత్సరాల పాలనలో భవన నిర్మాణ కార్మికుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. భవన నిర్మాణ కార్మికులు పోరాటం చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డు, ఆ బోర్డులో కార్మికుల సంక్షేమానికి వినియోగించుకునేందుకు ఉన్న నిధులను పక్కదారి పట్టించడం ఎంత వరకు న్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సంక్షేమ బోర్డు నిధులను జమచేసి కార్మికులకు పథకాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్లాడి గోపాల్, సిఐటియు రూరల్ కార్యదర్శి కిన్నెర కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం, సిఐటియు రూరల్ నాయకులు ఎస్.కె ఖలీల్, వెంకట్రావు, మాలకొండయ్య, రంగయ్య, శ్రీనివాసులు, రమణ, శాంతారావు, వెంకటేశ్వర్లు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె.అజయ్‌కుమార్

హామీలను నెరవేర్చిన సిఎం

ప్రజాశక్తి-పొదలకూరు

గత ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా నెరవేర్చి, రాష్ట్ర చరిత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సరికొత్త అధ్యాయానికి నాంది పలికారని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరులో శుక్రవారం ఆయన పలు అభివద్ధి పనులకు ప్రారంభోత్సవాలు జరిపారు. పట్టణంలో నూతనంగా నిర్మించిన వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్ , పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదలకూరు పంచాయతీ ని రూ.45 కోట్లతో అభివద్ధి చేశానన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా అభివద్ధి చేయలేకపోయినప్పటికీ, రెండోసారి అధికార పార్టీ ఎమ్మెల్యేగా, మంత్రిగా అభివృద్ధి సాధించినట్లు తెలిపారు.కార్యక్రమంలో జెడ్‌పిటిసి తెనాలి నిర్మలమ్మ, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, జి. గోపల్ రెడ్డి, పి. రమణారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కాకాణి

దామోదరంకు నివాళి

ప్రజాశక్తి-నెల్లూరు:సంజీవ్ గాంధీ నగర్ 32 డివిజన్ భవన నిర్మాణ కార్మిక సంఘం స్థానిక కమిటీ కార్యదర్శి నంద తమ్ముడు ఎస్ దామోదరం మృత దేహాన్ని సందర్శించిన భవన నిర్మాణకార్మిక సంఘం జిల్లా నాయకులు నివాళి అర్పించారు.గత నెల 29వ తేదీన ట్రైన్ యాక్సిడెంట్‌లో మృతి చెందారు. దామోదరం మృత దేహానికి నివాళు లర్పించిన వారిలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.గోపాల్, రూరల్ కార్యదర్శి కొండ ప్రసాద్, రూరల్ అధ్యక్షులు ఎస్.కె ఖలీల్. జిల్లా కమిటీ సభ్యులు ఎం. మణి. 28 డివిజన్ భవనం స్థానిక కార్యదర్శి రవి ఉన్నారు.

వాహనాలు వేలం

ప్రజాశక్తి-కందుకూరు:రవాణాశాఖ వారిచే తనిఖీలు నిర్వహించి నిర్బంధించిన వాహనాలను ఇంకను విడుదల చేసుకోకుండా ఉన్న వాటికి వేలం నిర్వహిస్తున్నట్లు కందుకూరు ఎంవిఐ మహ్మద్ రఫీ తెలిపారు.ఎస్ పి ఎస్ ఆర్ నెల్లూరు జిల్లాలోని వివిధ ప్రాంతాలలో కందుకూరు ఆర్టీసీ డిపో, కందుకూరు మోటర్ వాహన తనిఖీ అధికారి కార్యాలయంలో ఉన్న వాహనాలను ఈనెల 6 ఉదయం 11:00 గంటలకు కందుకూరు మోటార్ వాహనం తనిఖీ అధికారులు వేలం వేయుటకు నిర్ణయించారు. వేలంలో పాల్గొన సభ్యులు రూ.5వేలు డిపాజిట్ గా డీడీ లేదా క్యాష్ రూపంలో ఎస్ ఆర్ టి ఏ కావలి వారి పేరున చెల్లించాలి.

రిజిస్ట్రేషన్ల పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి- ఉలవపాడు: మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం నాడు నవరత్రాల్లో భాగంగా జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ తహాశీల్దార్ వీరయ్య అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి ఎంపీడీఓ ఎన్.విజయ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ వాలం వాయల మస్తానమ్మ, ఖాదర్ బాషా రాధ, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు: చెడు వ్యసనాలకు బానిసై సులువుగా నగదు సంపాదించాలన్న దురుద్దేశంతో దొంగతనాలకు, హత్యలకు పాల్పడుతూ తప్పించుకుని తిరుగు తున్న ఓ నిందితుడిని బుచ్చిరెడ్డిపాలెం పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్ పి డాక్టర్ కే తిరుమలేశ్వర రెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో మాట్లాడారు. గత నెల 21వ తేదీన బుచ్చిరెడ్డి పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒంటరిగా ఉన్న గెడిసిన ఈశ్వరమ్మ అనే వద్ధ మహిళ హత్యకు గురైనట్లు, మృతురాలి కుమా రుడు ఫిర్యాదు చేశాడన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా బుచ్చిరెడ్డిపాలెం పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారన్నారు. గతంలో ఇంటి మరమ్మతులు చేసే సమయంలో కోయ్య పని చేసే షేక్ రసూల్ బాషా మతురాలు ఒంటరిగా ఉండడం గుర్తించాడు. నేరచరిత్ర కలిగినటువంటి రసూల్ బాషా మతురాలి వద్ద బంగారు ఆభరణాలు ఉండడాన్ని గుర్తించాడు. బంగారు ఆభరణాలు తీసుకునే ప్రయత్నం చేశారు. అలికిడి కావడంతో నిద్రలేచిన వృద్ధురా లిపై నిందితుడు రసూల్ బాషా పక్కనే ఉన్న రాతితో దాడికి పాల్పడ్డాడు. వృద్ధురాలు ఈశ్వర మ్మ మృతి చెందినట్లు నిందితుడు ధ్రువీకరిం చు కొని సుమారు మూడు లక్షల విలువ చేసే ఆభరణాలను తీసుకొని పారిపో యాడ న్నారు. సిబ్బందిని ఎస్ పి అభినందించారు.

కృష్ణపట్నం పోర్టులో ఇద్దరు కార్మికులు మృతి

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం, కృష్ణపట్నం పోర్టుకు ఇండోనేషియా నుంచి బొగ్గులోడుతో వచ్చిన నౌకకు చెందిన ట్యాంకర్‌ను కోడూరు కదురు వేలు (34) కవరిగిరి యశ్వంత్ కుమార్ (22) అనే ఇద్దరు క్యాజువల్ కార్మికులు కార్మికులు శుభ్రపరుస్తున్నారు. ఈసమయంలో వారికి సరిపడ ఆక్సిజన్ అందక అపస్మారక స్థితికి చేరుకున్నారు. లోపలికి వెళ్లిన కార్మికుల నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో తోటి కార్మికులు లోపలకెళ్లి చూసే సరికి కింద పడిపోయి ఉన్నారు. వారికి కొంతమేర గాయాలైనట్లు ఉన్నాయి. వెంటనే యాజమాన్యం నెల్లూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.అప్పటికే మృతిచెందారని డాక్టర్లు ధ్రువీకరించారు.మృతుల కుటుంబాలతో యాజమాన్యం చర్చలు కొనసాగుతున్నాయి. పోర్టులో పనిచేస్తున్న కార్మికులకు సరైన భద్రతా పరమైన చర్యలు తీసుకోకుండా కార్మికుల చేత పనులు చేయించడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని పలువురు కార్మికులు వాపోతున్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మృతులు యశ్వంత్‌కుమార్, కదురువేలు

మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు నష్టపరిహారం అందజేయాలి సిఐటియు డిమాండ్

కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కారణంగా, షిప్పు లోపల సరైన భద్రతాపరమైన చర్యలు చేపట్టకుండా కార్మికులను పనికి పురమాయించి వారి మరణానికి కారణమయ్యారని సిఐటియు జిల్లా నాయకులు గోగుల శ్రీనివాసులు, గడ్డం అంకయ్యలు పేర్కొన్నారు. షిప్పు లోపలే ప్రమాదంతో మరణించి నట్లుగా తోటి కార్మికులు తెలిపారు. వాస్తవాలను సమగ్ర విచారణ జరిపించాలని తెలిపారు. ఇద్దరి కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 లక్షల రూపాయలు వంతున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలన్నారు.

జగనన్న విద్యాదీవెన విద్యార్థులకు వరం

ప్రజాశక్తి-నెల్లూరు

విద్యార్థులకు ఉన్నత విద్యపై భరోసా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా జిల్లాలో 46,648 మంది విద్యార్థులకు రూ.35.73 కోట్లు నిధులను నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేసినట్లు జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రు నుంచి జగనన్న విద్యాదీవెన నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగ న్మోహన్ రెడ్డి బటన్ నొక్కి తల్లుల ఖాతాలకు జమ చేశారు. జగనన్న విద్యాదీవెనకు సంబంధించిన నిధులు జమ చేసే కార్యక్రమాన్ని వర్చువల్ పద్ధతిలో నగరంలోని కలెక్టరేట్ తిక్కన ప్రాంగణం నుంచి జిల్లా అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజలు ఆర్థిక కష్టాలతో తమ పిల్లలను ఉన్నత విద్య చదివించడానికి ఇబ్బందులు పడుతున్న తరుణంలో వారు కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించేలా ప్రవేశపెట్టిన జగనన్న విద్యా దీవెన పథకం విద్యార్థులకు ఓ వరంలా మారిందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 2023-24 మొదటి త్రైమాసికానికి 9,44,666 మంది విద్యార్థులకు రూ. 708.68 కోట్ల ఫీజుల మొత్తాన్ని సిఎం జమచేయడం ఒక చారిత్రాత్మక నేపథ్యమన్నారు.పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడం సామాజిక బాధ్యతగా భావించిన సిఎం అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు.విద్యార్థులు ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ లవన్న, సోషల్, బీసీ వెల్ఫేర్ అధికారులు రమేష్, వెంకటయ్య, బీసీ కార్పొరేషన్ ఇడి నిర్మలాదేవి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆనం అరుణమ్మ

ఇద్దరు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-గుడ్లూరు

మండలంలోని పూరేటిపల్లిలో ఇద్దరు బర్రెల దొంగలు రెండు గేదలను తీసుకొని పోయి సింగరాయకొండ సంతలో అమ్ముతూ ఉండగా పోలీసులు వారిని అరెస్టు చేసి కందుకూరు కోర్టులోశుక్రవారం హాజరు పరిచారు. బాధితుడు జడ పృథ్వి రాజు ఫిర్యాదు మేరకు ఒంగోలుకు చెందిన కిరణకుమార్, సంగం కి చెందిన కడప నాగరాజు దొంగతనంగా తీసుకుపోయిన బర్రెల్ని అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-లింగసముద్రం : గ్రామాలల్లోనే పరిపాలన వ్యవస్థను తీసుకొచ్చి ప్రజలకు నేరుగా పాలన అందించాలనే లక్ష్యంగా పెట్టుకొని ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి సచివాలయం వ్యవస్థ తీసుకొచ్చారని కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాలను ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత మాలకొండ్రాయుని పాలెం గ్రామంలో 36 లక్షల రూపాయలతో గ్రామ సర్పంచ్ వంటేల శ్రీనివాసులు నిర్మించిన విలేజ్ క్లినిక్ సెంటర్, మిల్క్ సెంటర్‌ను ప్రారంభించారు. సర్పంచ్ శ్రీనివాసులు మహీధర్‌రెడ్డి ఫొటోతో భారీ చిత్రపటాన్ని తయారుచేయించి ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డికి అందజేశారు. అనంతరం లింగసముద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో 16 లక్షలతో నిర్మించిన లైబ్రరీని ప్రారంభించారు. అదే విధంగా పెంట్రాల పంచాయతీలోని చీమలపెంట రోడ్డులో 16లక్షలతో లైబ్రరీ, 22 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.21 లక్షలతో విలేజ్ క్లినిక్ సెంటర్, రూ.17.67 లక్షలతో పాలకేంద్రాలను నిర్మించారు. వీటిని కూడా ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి ప్రారంభించారు. ఒకే చోట ప్రభుత్వ భవనాలు అన్ని ప్రజలకు అందుబాటు ఉండటం వల్ల వారు నేరుగా పనులు చేయించుకోవచ్చున్నారు. మండల కేంద్రాలకు వెళ్లాకుండా గ్రామల్లోనే తమకు అవసరమైన పనులు పూర్తి చేసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు పెన్నా కృష్ణయ్య, తహశీల్దార్ శ్రీచరన్, ఎంపిడిఒ యు.శేషబాబు, పంచాయతీ రాజ్ డిఇ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహశీల్దార్ టి.ప్రసాద్, వైద్యాధికారి డాక్టర్ రమేష్, పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, వైసిపి మండల కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు వంటేల శ్రీనివాసులు, మన్నేపల్లి బాబురావు, మల్లిఖార్జున, పులి రాఘవులు, దగ్గు వెంకటేశ్వర్లు, మేకనబోయిన శ్రీనివాసులు, వెన్నపూస కొండారెడ్డి, వంకాయలపాటి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

షెడ్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ మహీధర్‌రెడ్డి

గాల్వనైజ్డ్ షెడ్ ప్రారంభం

ప్రజాశక్తి-లింగసముద్రం : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయలను, వసతులను ఏర్పాటు చేయడానికి దాతలు సహకరించడానికి ముందుకు రావడం అభినందనీయమని ఎంఎల్ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. లింగసముద్రంలోని కమ్మిశెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో నిర్మించిన గాల్వనైజ్ షెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ప్రారంభోత్సవానికి వస్తున్న మహీధర్‌రెడ్డికి పాఠశాల విద్యార్థులు పాఠశాల మొయిన్ గేటు దగ్గర కోలాటం మధ్య ఉపాధ్యాయ బృందం ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమం నిర్వహించి షెడ్‌ను ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడిశెట్టి మాధవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు వచ్చి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు గురించి చెప్పడంతో వెంటనే దాతలతో మాట్లాడి 19 లక్షల రూపాయలు ఇప్పించడం జరిగిందన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి విద్యార్థులకు షెడ్‌ను అందుబాటులోకి తీసుకరావడం వల్ల వారి ఎదుర్కొంటున్న సమస్యలు తొలగిపోతాయన్నారు. పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులు కూడా భాగస్వామ్యులు కావాలని చెప్పారు. పాఠశాలకు షెడ్ కావాలని అడిగిన వెంటనే దాతల ద్వారా సహకారం అందించిన ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డికి హెచ్ఎం మాధవరావు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారని వాటర్ ప్లాంట్ మంజూరుకు సహకరించాలని ఉపాధ్యాయ బృందం ఆయనను కోరడంతో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ ట్రస్టు ద్వారా వాటర్ ప్లాంట్‌లను ఇస్తున్నారని ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి చెప్పారు. విద్యార్థుల అవసరాల మేరకు వారి ట్రస్ట్‌కి లేటర్ పెట్టాలని హెచ్ఎం మాధవరావుకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి పెన్నా కృష్ణయ్య, కోఆప్షన్ సభ్యులు షేక్ షఫి, ఎంపిడిఒ శేషబాబు, డిఇ వెంకటేశ్వర్లు, తిరుపతిరెడ్డి, క్రిష్ణారెడ్డి, మచేపల్లి మాల్యాద్రి, మొగిలిచర్ల హెచ్ఎం కె.సూర్యప్రకాశ్‌రావు, నోటి వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి-లింగసముద్రం : మండలంలోని పెదపవని గ్రామ శివార్లో పేకాట ఆడుతున్న స్థావరంపై గుడ్లూరు సిఐ సుబ్బారావు, లింగసముద్రం ఎస్ఐ ఎం.బాజీ బాబు సిబ్బంది సహకారంతో దాడి చేసి ఇద్దరూ వ్యక్తులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కి తరలించారు. వీరి నుంచి రెండు ఫోన్లు, రెండు బైక్‌లు, రూ.18,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పత్తిపాటి శరత్ అక్రమ అరెస్టుకు ఖండన

ప్రజాశక్తి-కందుకూరు : మాజీ మంత్రివర్యులు చిలకలూరిపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు తనయుడు శరత్ ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్తిపాటి పుల్లారావును రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి అధికారాన్ని అడ్డంపెట్టుకొని ప్రతిపక్ష పార్టీ నాయకులను, వారి కుటుంబ సభ్యులను అక్రమ అరెస్టులు చేయించి భయభ్రాంతులకు గురిచేయడాన్ని మోషే తప్పుపట్టారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, తగిన మూల్యం చెల్లించుకుంటారని ఘాటుగా హెచ్చరించారు.

దాసరి రాజేష్‌కు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కప్పరాళ్ల తిప్ప గ్రామం సచివాలయ కన్వీనర్ దాసరి సురేష్ తమ్ముడు దాసరి రాజేష్ ఇటీవల రోడ్డు యాక్సిడెంట్‌తో తలకు చేతికి బలమైన గాయాలు కావడంతో ఇంటికే పరిమితమవ్వగా వారిని ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి దాసరి రాజేష్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ దాసరి రాజేష్ కుటుంబానికి వైసిపి అండదండలు ఎప్పుడూ ఉంటాయని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయనతోపాటు బోగోలు మండలం వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, స్థానిక నేతలు డేవిడ్‌పాల్, సాల్మన్‌రాజ్, సచివాలయ కన్వీనర్ దాసరి సురేష్, నాయకులు, తదితరులున్నారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పట్టణంలో నాలుగు పరీక్ష కేంద్రాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రియదర్శిని కాలేజీ 217 మందికి గానూ 200 మంది హాజరయ్యారు. 17మంది గైర్హాజరు. ఎస్ఎస్ఆర్ జూనియర్ కాలేజ్ 261మందికి గానూ 252 మంది హాజరయ్యారు. 09 మంది గైర్హాజరు. బిఎస్ఆర్ జూనియర్ కాలేజ్ 268మందికి గానూ 258 మంది హాజరయ్యారు. పదిమంది గైర్హాజరు. గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ 302 మంది విద్యార్థులకు గానూ 271 హాజరయ్యారు. 31మంది విద్యార్థులు గైరహాసరయ్యారు. విద్యార్థులు తొలిరోజు కావడంతో ఉదయం ఒక గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను స్కాన్ చేసి పరీక్ష కేంద్రాలకు తరలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాలలో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాశారని అధికారులు తెలియజేశారు.

ప్రజాశక్తి-కలిగిరి : స్థానిక కలిగిరిలోని ఆదర్శ పాఠశాలలో నిన్న జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని హాజరయ్యారు. మొత్తం 129మంది విద్యార్థులు కేటాయించగా 120మంది విద్యార్థులు హాజరయ్యారు. 9మంది విద్యార్థులు హాజరు కాలేదని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 241మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా మొదటి రోజు 15మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ హనుమంత్ యాదవ్ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు.

చారిత్రాత్మకంగా ఇళ్ల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబం సొంత ఇల్లు కలిగి ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం చారిత్రాత్మకమని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇళ్ల పట్టాలు మంజూరై రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు వాటిని ఎంఎల్ఎ మేకపాటి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ సొంతింటి కలను నిజం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇళ్ల పట్టాలను అందజేయడమే కాకుండా వాటిని రిజిస్ట్రేషన్లు సైతం చేసి లబ్ధిదారులకు అందచేయడంతో వారి సంతోషం వెలకట్టలేనిదన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ వ్యాప్తంగా 4219మంది లబ్ధిదారులకు పట్టాలు మంజూరు కావడంతో

ఇళ్లపట్టాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డి

వారికి అందజేయడం జరిగిందని, తమ పట్టాలను పొందేందుకు మహిళలు తమ కుటుంబాలతో సహా వచ్చి ఆనందంగా పట్టాలు తీసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి తెలిపిన హామీల్లో కీలకమైనది ఇళ్ల పట్టాల పంపిణీయేనని, జగనన్న ప్రభుత్వం పట్టా పొందిన ప్రతి ఒక్కరికీ శాశ్వత ఆస్తి లభించినట్లు అయిందన్నారు. వివిధ రకాల సంక్షేమ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులు వాటిని వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఇలా శాశ్వతంగా రిజిస్ట్రేషన్లు చేసి వారికి ఇంటి స్థలాలు అందజేస్తుండడంతో కుటుంబ వారసత్వ ఆస్తిగా ఉంటుందన్నారు. పట్టాలు పొందిన లబ్ధిదారులందరూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో తమ కుటుంబాలకు శాశ్వత ఆర్థిక భరోసా కల్పించారని అంటున్నారన్నారు. అలా రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారికి బ్యాంకు రుణాలు సైతం అందజేస్తున్నామని వివరించారు. ఇచ్చిన హామీని, చెప్పిన మాటను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అక్కచెల్లెమ్మలందరీ ఆశీస్సులతో రాబోయే ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో తప్పక విజయం సాధిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ, ఎంపిపి కేత వేణుగోపాల్ రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, పట్టణ వైసిపి అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, రూరల్ జెసిఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర, నోటి వినయ్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, తహశీల్దార్, ఆర్ఐ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఇంటింటి ప్రచారం

- పరిచయ వేదికలో దద్దరిల్లిన మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయకేకలు

మేకపాటికి ఘనస్వాగతం పలుకుతున్న మహిళలు

ప్రజాశక్తి-ఉదయగిరి

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నియోజక వర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని నందిపాడు సెంటర్లో భోగ్యం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన పరిచయ వేదికలో వైసిపి నాయకులు విజయ కేరింతలతో దద్దరిల్లించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాబోయేది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అని మీ దీవెనలు ఆశీర్వాదాలు ఉంటే నియోజకవర్గం ఎంఎల్ఏగా తాను గెలవడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసిపి గెలుపునకు ప్రతీ కార్యకర్త నాయకులు సైనికులకు పనిచేసి ఈ ప్రాంతం వైసిపి ఘనవిజయాన్ని ముఖ్యమంత్రికి కానుక ఇవ్వాలన్నారు. ముందుగా పాపంపల్లిబొట్టు గిల్లపాడు రెడ్లదిన్నె గ్రామాలలో విజయ సంకల్పయాత్రను గడపగడప తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ పథకం నేరుగా ఇంటికి చేరేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సచివాలయ వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి నేరుగా ప్రతి సంక్షేమ పథకాన్ని ఇంటికి చేర్చారన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రిని గెలిపించుకోవడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు మండల శివ, జెడ్‌పిటిసి, ఎంపిపి లక్ష్మీకాంతమ్మ, నందిపాడు యువ నాయకులు అశోక్, హనుమంతు, మండ్ల రమేష్, జనార్ధన్, రసూల్, పేజర్ రెడ్లదిన్నె సొసైటీ డైరెక్టర్ దశరథ రామిరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ మౌలాలి, ఎంపిపి మాలకొండయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా అబ్జర్వర్ జి.రాజ్యలక్ష్మీ

సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి-కావలి రూరల్

ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌పై గ్రామస్థాయిలో కల్పించే ముఖ్య మౌలిక సదుపాయాలపై అవగాహన కల్పించడం కోసం కావలి, బోగోలు, కొండాపురం మండల పరిధిలోని గ్రామ సర్పంచులకు, సచివాలయ కార్యదర్శులకు పూర్తిస్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నెల్లూరు జిల్లా అబ్జర్వర్ జి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మూడు రోజులు శిక్షణా పూర్తి చేసుకుని నాలుగో రోజు కావలి, బోగోలు, కొండాపురం, మండల పరిధిలోని గ్రామ సర్పంచ్‌లకు, సచివాలయం కార్యదర్శులకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌పై జాతీయ స్థాయి రిసోర్స్ పర్సన్ అరుణ్‌తో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించామన్నారు. డిఎల్‌పిఒ రాధా మాధవిలత, మండల ప్రత్యేక పరిపాలన అధికారి శ్రీధర్ బాబు, ఎంపిడిఒ ఎ వి మోహన్ రావు, ఇఒపిఆర్‌డి మహేశ్వరి, సర్పంచ్‌లు చిమ్మిలి శ్రీహరి నాయుడు, వుడా బ్రహ్మానందం, సురేష్, శ్రీనివాసులు, పేముల రాజేంద్ర, దేవరపల్లి రాధిక, సచివాలయం కార్యదర్శులు ఎస్‌కె మస్తాన్, శ్యాంసుందర్, వెంకటరమణ, నరేద్ర, సుధాకర్, శ్రీనివాసులు, గీత, అఖిల, లావణ్య, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-కోవూరు : పాఠశాలలో చదివి ప్రస్తుతం సమాజంలో ఒక స్థానంలో ఉన్న పూర్వ విద్యార్థులు తమను ఇంత వారిని చేసిన తాము చదివిన పాఠశాలకు ఏదైనా చేయాలనే సంకల్పాన్ని తీసుకోవడం ఇతరులకు స్ఫూర్తిదాయకమని ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆ పాఠశాల 1986-87 పదో తరగతి చెందిన విద్యార్థులు హరిబాబు, అనిల్‌కుమార్, మురళీలు ప్రత్యేకంగా చొరవ తీసుకుని రూ.25వేలు విలువ చేసే మైక్ సెటు పాఠశాలకు బహుమతిగా అందజేశారు. ఇదే స్ఫూర్తిని ప్రతీ విద్యార్థి తప్పక తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో విజేత ఆంగ్ల మాధ్యమ పాఠశాల కరస్పాండెంట్ హరిబాబు, ఫిజికల్ డైరెక్టర్ రమేష్‌బాబు, ఉపాధ్యాయులు ఉన్నారు.

విస్తృతంగా 'ఎడిఎఫ్' సేవలు

ప్రజాశక్తి-మర్రిపాడు

డిజిటల్ క్లాస్‌రూమ్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి

నియోజకవర్గంలో ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం (ఎడిఎఫ్) ద్వారా బ్రాహ్మణపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు ఎక్సైర్స్ సంస్థ సహకారంతో అందజేసిన డిజిటల్ క్లాస్ రూమ్‌ను ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డితో కలిసి మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధస్సు అనేది గొప్పదని, చిన్న కుటుంబాల్లో పుట్టినా చదువుతో ఎంతో ఎత్తుకు ఎదిగిన వారున్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని కష్టపడి చదివి అభివృద్ధిలోకి రావాలన్నారు. ప్రతిఒక్కరూ బాగా చదువుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంస్కరణలను తీసుకొచ్చారని, ప్రతీపేద విద్యార్థి ఉన్నత చదువులు చదువుకునేలా ఆయన కృషి చేస్తున్నారన్నారు. ప్రపంచంతో మన విద్యార్థులు పోటీ పడేలా మన విద్యార్థులను తీర్చిదిద్దే ఉన్నత లక్ష్యంతో ఉన్నారని, విద్యార్థులు కూడా ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్రాహ్మణపల్లి పాఠశాల అభివృద్ధి కోసం ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి తమ పూర్తి సహకారం అందిస్తారని, మన ఊరి పాఠశాల విద్యార్థులు అందరూ మెచ్చేలా విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ సీడ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఆర్.చంద్రమౌళీశ్వరరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం నేతృత్వంలో సీడ్స్ సంస్థ సహకారంతో నియోజకవర్గంలోని 100 పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూంలు ఏర్పాటు చేసే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకున్నారని, ఇప్పటి వరకు 25 పాఠశాల్లలో డిజిటల్ క్లాస్ రూంలు ఏర్పాటు చేసి ఉన్నారన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూములను విద్యార్థులు బాగా సద్వినియోగం చేసుకునేలా తర్ఫీదునివ్వాలని, దాని ద్వారా భవిష్యత్తులో ప్రపంచంతో పోటిపడే విధంగా విద్యార్థులు తయారవుతారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువు పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం బయట ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే ఉండేలా వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆత్మకూరు నియోజకవర్గంలో అవసరమైన అభివృద్ధి, మౌలిక వసతులు, విద్య, వైద్యం, వ్యవసాయాభివృద్ధి ఏర్పాటు చేసిందే ఎడిఎఫ్ అని, దాని సేవలు నిరాటంకంగా కొనసాగుతాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి నిర్ణయాలతోనే రాజీనామాలు

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-ఉదయగిరి : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలతో తాము పార్టీని వీడుతున్నట్లు మాజీ సొసైటీ అధ్యక్షులు ఉండేల గురువారెడ్డి, కమ్మవారిపాలెం అన్నపురెడ్డి వెంగళరెడ్డి తన అనుచరగణంతో రాజీనామాలు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని దుత్తలూరు మండలం, నందిపాడు గ్రామంలో వైసిపి నాయకులుగా తాము మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో దుత్తలూరు మండలంలోని 17పంచాయతీలకు సంబంధించి వైసిపి నాయకులు రాజీనామాలు చేస్తారని తెలియజేశారు. దుత్తలూరు మండలంలో వైసిపి ఖాళీ అవుతుందని, త్వరలో ఏ పార్టీలో చేరేది అనేది తెలియజేస్తామన్నారు.

చెక్కు అందజేత

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని చాబ్రోలు గ్రామానికి చెందిన నరసాపురం తిమ్మయ్యకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.లక్ష చెక్కును ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి, మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డితో కలసి అందజేశారు. శుక్రవారం బ్రాహ్మణపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఎడిఎఫ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూము ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదవారందరినీ ఆదుకునే లక్ష్యంతో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థికసాయం అందచేసి బాధితులను ఆదుకుంటున్నారని, ఇలాంటి సిఎంను ప్రతిఒక్కరూ మళ్లీ ఆదరించాలని కోరారు. వారివెంట ప్రజాప్రతినిధులు కృష్ణప్రసాద్ రెడ్డి, నాయకులున్నారు.

కంపచెట్లు తొలగింపు

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని సోమశిలలో కంపచెట్లు పెరిగిపోవడంతో గ్రామపంచాయతీ ప్రత్యేక దృష్టి సారించింది. శుక్రవారం సోమశిల గ్రామ ఉపసర్పంచ్ షేక్ మహబూబ్ బాషా, వైసిపి నాయకులు బట్రెడ్డి పోలిరెడ్డి ఆధ్వర్యంలో కంపచెట్లు తొలగింపు పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మహబూబ్ బాషా, స్థానిక వైసిపి నాయకులు మాట్లాడుతూ గ్రామంలోని రామాలయం, గిరిజన గురుకుల పాఠశాల రోడ్లు ఇరువైపుల, ప్రాజెక్టు క్యాంపు కాలనీలో ఉన్న చెట్లను జెసిబితో తొలగించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు అన్నలూరు బాలకృష్ణ, పెంచలయ్య, సోమశిల ప్రాజెక్టు క్లస్టర్ ఇన్‌ఛార్జి కోడి నాగశేషు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి-కావలి

6వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి కత్తి సుధాకర్ వారి కుటుంబ సభ్యులు చెంచురామయ్య, చంటి, వారి కుటుంబ సభ్యులతో పాటు పలు కుటుంబాలు శుక్రవారం టిడిపిని వీడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంఎల్ఎ రామిరెడ్డిని మూడోసారి ఎంఎల్ఎగా గెలిపించుకునేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేస్తామని కత్తి సుధాకర్ తెలిపారు.

టిడిపిలో వైసిపి నేత చేరిక

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని 12వ వార్డులో శుక్రవారం వార్డు వైసిపి ఇన్‌ఛార్జి దావులూరి శ్యాంసన్ వైసిపిని వీడి టిడిపిలో చేరారు. అరుంధతీయపాలెంలో శ్యాంసన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, ఎబిఎం సంస్థల అధినేత జిడిడి దివాకర్‌తో కలిసి పాల్గొన్నారు. ముందుగా వార్డులోని మహిళలు క్రిష్ణారెడ్డికి హారతులు పట్టారు. భారీగా తరలివచ్చిన జనం క్రిష్ణారెడ్డిని ఆశీర్వదించారు. వార్డులోని ప్రజలు భారీగా ఆయన ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. టిడిపిలో భారీగా చేరిన వారికి క్రిష్ణారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. దావులూరి శ్యాంసన్ మాట్లాడుతూ వైసిపిలో అన్నీ మోసపు మాటలేనని, ఏ ఒక్క అభివృద్ధి పని చేయించుకోలేని పరిస్థితి అని తెలిపారు. ఎంఎల్ఎ చెప్పేవన్నీ అబద్ధాలే అని, ఒక్కటి కూడా నిజం ఉండదన్నారు. కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపించే వరకు విశ్రమించనని తెలిపారు. కావ్యక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ అరుంధతీయవాడతో తనకు ప్రత్యేక బంధం ఉందని, అరుంధతీయుల దైవం మాతమ్మను తీసుకొని వచ్చి దుస్తులు పెట్టడం తమ ఇంటి ఆనవాయితీ అన్నారు. టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా ఉన్న తనకు ఆశీర్వాదాలు కావాలన్నారు. పేదవాడిని ధనవంతుడు చేద్దామనుకుంటున్న చంద్రబాబును ముఖ్యమంత్రిని చేద్దాం అని, ఎంఎల్ఏగా తనను గెలిపించాలని కోరారు. గెలిచిన వెంటనే బాబూ జగ్జీవన్‌రావు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని తెలియజేశారు. జిడిడిదివాకర్ మాట్లాడుతూ ఏ ఒక్క ఓటు కూడా వైసిపికి పడకుండా పాలెంలోని 2700 ఓట్లను టిడిపికే వేసి కావ్యక్రిష్ణారెడ్డిని గెలిపించుకోవాలన్నారు. తెలుగుదేశం పార్టీ గెలిస్తేనే పేదల బతుకులు బాగుపడుతాయన్నారు. 12వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి దావులూరి దేవకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కావలి పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, అక్కిలగుంట సూర్యప్రకాష్, బొమ్మ శ్రీనివాసులు, బొమ్మ వెంకట్రావు, రమణయ్య, వెంకట రమణయ్య, జయమ్మ, చెవూరు రఘురామ్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

టిడిపిలో ముస్లిములు చేరిక

స్థానిక 22వ వార్డు నుండి పలువురు ముస్లిం వైసిపి నేతలు టీడీపీలో చేరారు. 22వ వార్డు ఇన్‌ఛార్జి కుందుర్తి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం కావలి టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో షేక్ సలీం, అబ్దుల్లా, షాకీరా, రేష్మ, మోబినా, అబ్దుల్ అజీజ్, కరిష్మా, ముంతాజ్, వాహిదా, తాసిన్, యాసిన్, రియాజ్, ఖాదర్ బాషా, మస్తాన్, ఖలీల్, గౌసియా, తదితర ముస్లిములు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి కావలి టిడిపి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : రజక సంఘం అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో 20 రజక కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. కావలి టిడిపి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి వారికి కండువాలు కప్పి సాధరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ వైసిపి ప్రభుత్వంలో రజకులకు ఎలాంటి పథకాలు అందలేదన్నారు. కార్యక్రమంలో బోగోలు మండల అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్తలను శుక్రవారం తిమ్మారెడ్డిపల్లి టిడిపి కార్యాలయంలో పార్టీ కండువాను వేసి పార్టీలోకి ఆహ్వానించినట్లు మాజీ మండల ప్రధాన కార్యదర్శి షేక్ మాలకొండ రాయుడు, స్థానిక నాయకులు దమ్ము పెద్దయ్య తెలిపారు. గ్రామ అధ్యక్షులు వెంగళరావు, ఉపాధ్యక్షులు సుకుమార్, కార్యదర్శి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపతయ్య

మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని గొల్లపల్లి గ్రామ రోడ్డు ద్వారా కాంచెరువుకు మద్యం సీసాలతో స్కూటీపై వెళ్తుండగా 131మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఎస్ఐ కె.తిరుపతయ్య తెలియజేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పామూరు మండలంలో గతంలో మద్యం దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న సయ్యద్ గఫూర్ శుక్రవారం ఉదయం పామూరు నుండి వరికుంటపాడు మండలంలోని గొల్లపల్లి గ్రామ రోడ్డు ద్వారా కాంచెరువుకు మద్యం బాటిళ్లతో స్కూటీపై వెళ్తుండగా 131 మద్యం బాటిళ్లను ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయనవెంట కానిస్టేబుల్ లోకసాని ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని వేగూరు గ్రామంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ విజయశ్రీ నిశితంగా పరిశీలించారు. ఎన్నికల కమిషన్, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కోవూరు మండలంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే సెక్టోరియల్ అధికారులు పరిశీలన చేపట్టారు. ఆర్ఐ రమణయ్య, గ్రామ రెవెన్యూ అధికారి మల్లికార్జున, తడితరులున్నారు.

ఓటు నమోదు నిరంతర ప్రక్రియ

ప్రజాశక్తి కోవూరు

ప్రజాస్వామ్య దేశంలో ఓటు నమోదు అనేది నిరంతర ప్రక్రియ అని ఇప్పటికే ఈ విషయమై యువతలో అవగాహన కల్పించేలా సదస్సు కూడా నిర్వహించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన రాజకీయ పార్టీ నాయకులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్లు మధు, రవికుమార్ ఉన్నారు.

7న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం 7వ తేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణంలోని సమావేశ మందిరంలో ఎంపిపి అధ్యక్షతన జరుగుతుందని ఎంపిడిఒ బాలాజీనాయక్ ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్ సభ్యులు, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

కాలువ పనులకు ఎట్టకేలకు మోక్షం

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు పంచాయతీకి సంబంధించి ప్రధాన కాలువ రూపురేఖలు మార్చేందుకు ఎట్టకేలకు పంచాయతీ పాలకవర్గం నడుం బిగించింది. ప్రస్తుతం ఈ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ఈ పనులను ఆర్ డబ్ల్యూఎస్ డిఇ లీలా ప్రకాష్, ఎఇ జగదీష్‌లు పరిశీలించారు. సర్పంచ్ విజయ, ఉపసర్పంచ్ మైనుద్దీన్, వార్డు సభ్యులు అత్తిపల్లి అనూరెడ్డి, తదితరులు ఉన్నారు.

మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

కావలిలో...

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం మెయిన్ రోడ్డులోని మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రావు విగ్రహం వద్ద ఎస్‌సి వర్గీకరణ కోసమై అసువులుబాసిన అమరవీరులకు శుక్రవారం ఘనంగా నివాళులర్పించి మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. మొదటిగా డాక్టర్ బాబూ జగ్జీవన్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎంఎస్‌పి గౌరవాధ్యక్షులు గోచిపాతల వెంకటేశ్వర్లు. ఎంఎస్‌పి జిల్లా మహిళా అధ్యక్షురాలు గ్యార జానకి మాల పాల్గొన్నారు. ఎంఎస్‌పి జిల్లా అధికార ప్రతినిధి చేవూరు కిరణ్ కుమార్ మాట్లాడుతూ అమరవీరుల త్యాగ ఫలాలతోనే త్వరలో ఎస్‌సి వర్గీకరణ ద్వారా యావత్ జాతి మొత్తం అనుభవించే రోజు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. వారి ప్రాణత్యాగానికి నిజమైన నివాళి ఇది కాదని ఎస్‌సి వర్గీకరణ చేసినప్పుడేనని, న్యాయం మన వైపున ఉంది కాబట్టి సుప్రీంకోర్టులో న్యాయమే గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఎల్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌడపేరు కొండయ్యమాదిగ, ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొణిజేటి రామ్మోహన్‌మాదిగ, నియోజకవర్గ ఎంఎస్‌పి అధ్యక్షులు అక్కిలిగుంట ఏసు మాదిగ, ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ అధ్యక్షులు ఐమూరి మహేష్ మాదిగ, ఎంఎస్‌పి నియోజకవర్గ ఉపాధ్యక్షులు కత్తి శివయ్య మాదిగ, ఎంఎస్‌పి కావలి మండల అధ్యక్షులు కత్తి బుజ్జిబాబు మాదిగ, ఎంఆర్‌పిఎస్ కావలి పట్టణ ప్రధాన కార్యదర్శి రసూల్ మాదిగ, ఎంఆర్‌పిఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ మాదిగ, మనోజ్ కుమార్ మాదిగ, కత్తి శ్రీకాంత్ మాదిగ, చేవూరు శివకుమార్ మాదిగ, మొదలగు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కలిగిరి : ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణ లక్ష్య సాధనలో భాగంగా జాతి బిడ్డల భవిష్యత్తే ముఖ్యమని వర్గీకరణ పోరులో అసువులు బాసిన మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలం ఎంఆర్‌పిఎస్ ఇన్‌ఛార్జి నందిపోగు వెంగళరావు మాదిగ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా

కలిగిరిలో..

ఎంఆర్‌పిఎస్ నాయకులు మాట్లాడుతూ ఏ లక్ష్య సాధన కోసం అయితే అమరవీరులు అసువులు బాశారో అదే లక్ష్యాన్ని మహాజన నేత మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్‌సి వర్గీకరణ సాధించి జాతి బిడ్డల భవిష్యత్‌కు పూలబాట వేసి, అమరవీరుల ఆశయాలను నెరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి మండల కన్వీనర్ రోడ్డా హాజరత్ మాదిగ, కో-కన్వీనర్ బొర్రా వెంగయ్య మాదిగ, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు కూనిపోగు యిర్మీయా మాదిగ, పందల శ్రీనివాసులు మాదిగ, ఎంఎస్ఎఫ్ నాయకులు ఐమూరి మోజెష్ మాదిగ, తుమ్మూరి సుధీర్ కుమార్ మాదిగ, కర్రా రాజు మాదిగ, గోసాల లక్ష్మీనరసింహ మాదిగ, చెరుకూరి ఇస్సాక్ మాదిగ, గంగపట్ల దేవరాజ్‌మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

బండి రామిరెడ్డికి ఎంఎల్ఎ నివాళులు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం కోవూరుపల్లి గ్రామానికి చెందిన బండి రామిరెడ్డి అనారోగ్యంతో మరణించగా శుక్రవారం ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి బండి రామిరెడ్డి మృదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ బండి రామిరెడ్డి మృతి వారి కుటుంబ సభ్యులకు తీరని లోటని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతోపాటు బోగోలు మండల వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, కోవూరుపల్లి సర్పంచ్, నాయకులున్నారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ప్రజల ఆరోగ్యాల పట్ల జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపు తోందని వైసీపీ నాయకులు కావల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం జ రిగింది. ఎంపీడీఓ నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోందన్నారు. జగనన్న ఆ రోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబంలో ఎటువంటి ఖర్చులు లేకుండా ఉచితంగా చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా చికిత్సలు చేస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా విలేజ్ హెల్త్ క్లినికల్‌లో ఉండే డాక్టర్ల సూచన మేరకు గ్రామ వాలంటీర్ల సహాయంతో వారి ఇంటి వద్దకే మందులు సరఫరా చేయడం జరుగు తుందని తెలిపారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా

మాట్లాడుతున్న వైసిపినేత కావల్‌రెడ్డి రంగారెడ్డి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో సచివాలయ సిబ్బంది, గ్రామవా లంటీ ర్లు పాల్గొన్నారు. వరిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు వైద్య చికిత్సలు పొందారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మన్నెం చిరంజీవి గౌడ్, పాకం ప్రవీణ్, సచివాలయం ఉద్యోగులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పశువులను వాహనంలోకి తరలిస్తున్న అధికారి వెంకటరమణ

రోడ్లపై పశువుల సంచారం నిషేధం

- అతిక్రమిస్తే యజమానులకు జరిమానా..

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

రోడ్లపై పశువుల సంచారం వల్ల తరచూ వాహనదారులు ప్రమాదానికి గురి కావడంతో పాటు, ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలుగుతుండడంతో నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన రోడ్లపై పశువుల సంచారాన్ని నిషేధించామని, అతిక్రమించి సంచరించే పశువుల యజమానులకు జరిమానాలు విధిస్తామని ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ పేర్కొన్నారు. స్థానిక మద్రాస్ బస్టాండ్ కూడలిలోని ఏ.సీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్టు సమీపంలో గ్రాండ్ ట్రంక్ రోడ్డుపై సంచరిస్తున్న పశువులను ప్రత్యేక వాహనాల ద్వారా కల్లూరుపల్లిలోని గోశాలకు శుక్రవారం తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ మేయర్, కమిషనర్ ల ఆదేశాల మేరకు నగరంలోని అన్ని ప్రధాన రోడ్లపై ప్రత్యేక బృందాలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజూ పశువుల సంచారంపై ప్రత్యేక నిఘా ఉంటుందని, వాటిని తమ పరిసర ప్రాంగణాలలోనే ఉంచుకోవాలని యజమానులను హెచ్చరించారు. కార్యక్రమంలో వెటర్నరీ వైద్యులు డాక్టర్. మదన్ మోహన్ రెడ్డి, శానిటేషన్ విభాగం సూపర్ వైజర్లు, ఇన్‌స్పెక్టర్‌లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 20వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్లో పలు అభివృద్ధి నిర్మాణ పనులకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేయడం జరిగింది. డివిజన్లోని ఇస్కాన్ టెంపుల్ సమీపంలో రూ.43 లక్షల నిధులతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. డివిజన్లో అభివద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు విచ్చేసిన ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి, శ్రీఇరుకళల పరమేశ్వరి దేవస్థానం ఛైర్మన్ రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్) ఆధ్వర్యంలో కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. మేయర్ పొట్లూరు స్రవంతి జయవర్ధన్, మాజీ డిసిసిబి ఛైర్మన్ ఆనం విజయకుమార్ రెడ్డి, నెల్లూరు విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మొదటిరోజే ఇంటర్ పరీక్షల్లో పక్షపాతం

ప్రజాశక్తి-పొదలకూరు

గతేడాది వరకు పొదలకూరులో ప్రశాంతంగా జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ ఏడాది ఓ ప్రయివేట్ కళాశాలకు పరీక్ష కేంద్రాన్ని కేటాయించడంతో వివాదాస్పదంగా మారింది. ఆ పరీక్షా కేంద్రానికి చెందిన కాలేజీ విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షల రాస్తున్నారు.ఆ ప్రైవేట్ పరీక్ష కేంద్రంలో మాత్రం ఆ కళాశాలకు పోటీ కళాశాలైన విద్యార్థులు ఆ కేంద్రంలో పరీక్షలు రాస్తున్నారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాత్రం బెంచ్ కి ఇద్దరు ఉండగా, ప్రయివేట్ కేంద్రంలో మాత్రం వారి పోటీ కళాశాల విద్యార్థులు పరీక్షలు రాస్తుండంతో వారిని బెంచ్ ఒక్కొక్కరిని కూర్చోబెట్టారు. దీంతో ఆయా కేంద్రాల వద్ద వారి పిల్లల్ని వదలడానికి వెళ్లిన తల్లిదండ్రులు పరీక్ష రాస్తున్న విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరీక్ష కేంద్రం కలిగిన ప్రైవేట్ కళాశాల విద్యార్థులు మొత్తం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బెంచికి ఇద్దరు లెక్కన రాస్తుండగా, ప్రైవేట్ పరీక్ష కేంద్రంలో మాత్రం బెంచ్ కు ఒక్కొక్కరి చొప్పున వేసి పక్షపాతం చూపిస్తున్నారని దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దీనివలన ప్రైవేట్ పరీక్ష కేంద్రం కలిగిన కళాశాల విద్యార్థులు లబ్ధి పొందుతారని తద్వారా మరో పోటీ కళాశాలలో విద్యార్థులు ఇబ్బంది పడతారని, ఇది సరైన పద్ధతి కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. రెండు కేంద్రాల్లో ఒకేలాగా పరీక్షలు నిర్వహణ ఉండాలని వారు కోరుతున్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ పొంగూరు సింధూర

'పేదల కడుపు కొట్టింది జగనే'

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

టిడిపి ప్రభుత్వంలో అన్నా క్యాంటీన్లను ఏర్పాటుచేసి నిరుపేదలకు కడుపునిండా అన్నం పెట్టే వారిని, వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని మూసివేసి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేదల కడుపు కొట్టారని మాజీ మంత్రి, నెల్లూరు సిటీ అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ కుమార్తె డాక్టర్ సింధూర మండిపడ్డారు. నెల్లూరు నగరం 44వ డివిజన్‌లోని శివ ప్రియ ,వెంకటరమణ హోటల్ ఆపోజిట్ తదితర ప్రాంతాల్లో బాబుష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం ఆమె నిర్వహించారు.డివిజన్‌లోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆమెకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సింధూర నాయకులు, మహిళా నాయకురాళ్లతో కలిసి డివిజన్‌లోని ప్రతి ఇంటికి, షాపులకెళ్లి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే మాజీ మంత్రి నారాయణ చేసిన అభివద్ధిని తెలియజేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం నిరుపేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. వాటిని వైసిపి ప్రభుత్వం తొలగించిన ఘనత ఒక్క ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతరామయ్య వర్ధంతి

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

ప్రముఖ న్యాయవాది , మేధావి కామ్రేడ్ వేములపాటి అనంతరామయ్య 9వ వర్ధంతి వేడుకలు శుక్రవారం సంతపేటలోగల సిపిఐ నగర కార్యాలయం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు వి.రామరాజు మాట్లాడుతూ, అనంతరామయ్య న్యాయవాదిగా జిల్లాలో, రాష్ట్రంలో పేరుగాంచిన వ్యక్తిగా, కమ్యూనిస్టు నాయకుడుగా, పేదల పక్షపాతిగా గుర్తింపు పొందారన్నారు. ప్రపంచ దేశాలలో సైతం ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. చేగువేరా, నెల్సన్ మండేలా, కురుచేవ్, లాంటి ప్రపంచ నాయకులతో ఆయన పరిచయస్తుడన్నారు. సింహపురి పౌరసమాఖ్య పేరుతో నిచ్చెన గుర్తుతో పోటీ చేసి అప్పట్లో నగరంలో చాలా మందిని గెలిపించి ప్రజానాయకుడుగా మన్నలను పొందారన్నారు.పేరు పొందిన న్యాయవాదులకు సైతం అనంతరామయ్య సలహాలు, సూచనలు తీసుకునేవారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దామా అంకయ్య , ఏ.ఐ.టి.యు.సి జిల్లా అధ్యక్షులు పి.జిలానీఖాన్, సిపిఐ నాయకులు షాన్‌వాజ్, వాటంబేటి నాగేంద్ర, పి.లీలామోహన్, షేక్.ముక్తియార్, కె.స్టాలిన్, లజపతిరాయ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న, మధ్యతరహా పరిశ్రమలను గుర్తించండి

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

రాష్ట్ర ప్రభుత్వం చిన్న, మధ్య తరహా పరిశ్రమలను అభివద్ధి చేసేందుకు సిద్ధంగా ఉందని ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు, కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్‌ల ఆదేశాల మేరకు సచివాలయాల పరిధిలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలను గుర్తించి, వాటి నిర్వహణ వివరాలను సర్వే చేయాలని అమెనిటీస్ కార్యదర్శులకు అదనపు కమిషనర్ శర్మద తెలిపారు. సర్వే శిక్షణను నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగంలో శుక్రవారం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తయారీ, సేవల, వాణిజ్య, రిటైల్ రంగాల ద్వారా నడుస్తున్న పరిశ్రమల సమగ్ర సమాచారాన్ని సర్వే ద్వారా సేకరించి ప్రభుత్వానికి నివేదించాలన్నారు. ఎంఎస్ఎం ఈ మొబైల్ యాప్‌ను ఉపయోగించి సర్వే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ విభాగం ఎస్ఇ సంపత్ కుమార్, సచివాలయాల అమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి నెల్లూరు సిటీ

రాష్ట్రంలో ప్రజాబలం టిడిపి వైపే ఉందని అభివద్ధి, క్షేమం పథకాలు ప్రజల వద్దకే చేర్చేందుకు నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తారని ఎన్నికల్లో టిడిపిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 35వ డివిజన్, లక్ష్మీనరసింహపురంకు చెందిన మౌలాలి, మహేంద్ర, షాకీర్, కనక, అజయ్ వారి మిత్రబృందం శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ అధికారం లేకపోయినా ప్రజలు టిడిపిలో చేరి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో చరిత్ర ఎరుగని మెజారిటీతో, భవిష్యత్తులో మళ్లీ రావాలన్నా కూడా రాని అతిపెద్ద మెజారిటీతో తెలుగుదేశం, జనసేన పార్టీల విజయం సాధించబోతుందన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి సంక్షేమం అభివద్ధి రెండు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు తాటి వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి చంద్రనాగ్, షేక్ షంషుద్దీన్, లక్ష్మి రెడ్డి, కుమార్ రాజా, చీపినాపి రవి, కార్తీక్, గిరీష్ కుమార్ యాదవ్, అంకోష్ నాయుడు, మాముడూరు ప్రసాద్ పాల్గొన్నారు.